క్లుప్తంగా

బస్వాపూర్ సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్‌గా మద్ది స్వామి



భిక్కనూరు: బస్వాపూర్ సొసైటీ విభజన విషయంలో కోర్టు తీర్పు రైతుల విజయమని నూతనంగా ఇన్‌చార్జి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మద్ది స్వామి అన్నారు. వైస్ చైర్మన్‌గా ఉన్న మద్ది స్వామిని సహకార శాఖ అధికారులు కోర్టు ఉత్తర్వుల మేరకు ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారు. దీంతో స్వామి సోమవారం విండో కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మద్ది స్వామి మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సహకారంతో ఇన్‌చార్జి చైర్మన్ గా నియమితులయ్యాయని,ఆయనకు ఎంతగానో రుణపడి ఉంటానన్నారు. రైతుల అభిప్రాయాలను గౌరవించకుండా కాంగ్రెస్ నేతలు సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమించారని ఆ నియమాకాలు చెల్లవని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. విండో సీఈవో మహేశ్వరి, రామేశ్వర్‌పల్లి విండో చైర్మన్ నాగార్తి భూంరెడ్డి మాజీ సర్పంచ్‌లు తున్కి వేణు, పోతిరెడ్డి, జనగామ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

వరిగడ్డిని అందించండి

భిక్కనూరు: దక్షిణకాశీగా పేరొందిన భిక్కనూరు సిద్దరామేశ్వరాలయానికి వరిగడ్డిని మక్క జూడును అందించాలని ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన భిక్కనూరులో మాట్లాడుతూ.. ఆలయంలో కోడె దూడలు, గోవులు ఉన్నాయని, వీటికి ఆహారంగా గడ్డి దానా అవసరం ఉందని రైతులు వరి గడ్డిని కాల్చివేయకుండా ఆలయానికి తీసుకవచ్చి ఇవ్వాలని సూచించారు.

వైకుంఠధామం పనులను పూర్తి చేయాలి



ఎల్లారెడ్డిరూరల్: వైకుంఠధామం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ సిబ్బందికి సూచించారు. సోమవారం గ్రామ శివారులో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులు ఆయన పరిశీలించారు. పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. కౌన్సిలర్ నీలకంఠం, మాజీ వైస్ ఎంపీపీ నునుగొండ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్, పోచయ్య, తిరుపతి, ఏఈ వినోద్ తదితరులున్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

ఎల్లారెడ్డిరూరల్: అంగన్‌వాడి సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడి కార్యకర్తలు సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు కుర్మ సాయిబాబా, వెంకట్రాంరెడ్డిలకు వినతిపత్రం అందించారు. అంగన్‌వాడి సిబ్బందికి సంబంధించిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని వారు విన్నవించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి సిబ్బంది దేవకర్ణ, పద్మ తదితరులున్నారు.

పేరిణి నృత్యంలో అడ్లూర్‌ఎల్లారెడ్డివాసికి అవార్డు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): పేరిణి నృత్యంలో అడ్లూర్‌ఎల్లారెడ్డి వాసి దీపిక అవార్డును అందుకుంది. భారతీయ కళా సంస్కృతి 8వ యాన్యువల్ ఈవెంట్స్- హైదరాబాద్‌లోని ఫీనిక్స్ ఎరేనాలో ఆదివారం నిర్వహించారు. దీపికకు అవార్డుతో పాటు, మెమోంటో, నగదు పురస్కారం అందజేశారు. పేరిణిలో రాష్ట్ర స్థాయిలో అవార్డు దక్కడం గర్వకారణంగా ఉందని దీపిక పేర్కొన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామ సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఏపీడీ మురళీ కృష్ణ సూచించారు. సోమవారం రైతువేదిక భవనంలో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బ్యాంక్ లింకేజీ రుణాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. మహిళ శక్తికి సంబంధించిన కార్యక్రమాల గురించి వివరించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభ, ఏపీఎం రాజిరెడ్డి, డీపీఎంలు రవీందర్ రావు, సుధాకర్, వకుల, స్త్రీనిధి ఆర్ఎం కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలి

సాక్షి నెట్‌వర్క్:ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) సభ్యులు సోమవారం కోరారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో తహసీల్దార్లకు సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు ఇవ్వాలని, పీఆర్‌సీ ప్రకటించాలని, 317 జీవో బాధిత ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాకు పంపాలని, సీపీఎస్ రద్దు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెండింగ్ బిల్లులు అన్నీ చెల్లించే విధంగా ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని తపస్ ప్రతినిధులు వేడుకున్నారు. సమస్యలు పరిష్కరించని యెడల నవంబర్ 23న హైదరాబాద్‌లో ధర్మాగ్రహ దీక్ష చేపడతామని వెల్లడించారు.



బాన్సువాడలో సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేస్తున్న తపస్ నేతలు



మద్నూర్‌లో తహసీల్దార్ ముజీబ్‌కు వినతి పత్రం



నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు..



లింగంపేట తహసీల్దార్ నరేందర్‌కు..

ప్రశాంతంగా ముగిసిన బంద్



బీబీపేటలో బంద్‌తో బోసిపోయిన ప్రధాన చౌరస్తా



పాల్గొన్న హిందూ ఐక్య వేదిక సభ్యులు

బీబీపేట: హిందూ దేవుళ్లు, దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బీబీపేట బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే వాణిజ్య, వర్తక, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. హిందూ ఐక్యవేదిక సభ్యులు ప్రధాన కాలనీల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: హిందు సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు భిక్కనూరు మండల కేంద్రంలో సోమవారం విజయవంతమైంది. వర్తక, వాణిజ్య, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా మూసి ఉంచారు. ప్రభుత్వం హిందూ దేవాలయాల్లోని విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హిందు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.



భిక్కనూరులో మూసి ఉన్న దుకాణాలు

అనుమతుల్లేకుండా టపాసులు విక్రయిస్తే కేసులు నమోదు



ఎస్సై పుష్పరాజ్

రాజంపేట: అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై పుష్పరాజ్ హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ డీఎస్పీ అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనుమతులు పొందిన వారు మాత్రమే టపాసులు విక్రయించాలని, అనుమతి పొందిన వారు ఇళ్లకు దూరంగా నీరు, ఇసుక, యాంటిఫైర్ ఎక్విప్మెంట్ లాంటివి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖ అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



పిట్లం(జుక్కల్): బండపల్లిలో సోమవారం సైబర్ నేరాలపై ప్రజలకు ఏఎస్సై లింబాంద్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ బ్యాంక్ వివరాలు, ఓటీపీ నెంబర్‌లు అడిగితే చెప్పవద్దన్నారు. అనవసరపు లింకులు ఓపెన్ చెయ్యవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది సాయిబాబా, విజయ్ పాల్గొన్నారు.

'బాపురెడ్డి ఉద్యమాన్ని ముందుండి నడిపించారు'

బాన్సువాడ రూరల్: బాన్సువాడ గడ్డపై గులాబీ జెండాను పట్టుకోవాలన్నా, ముట్టుకోవాలన్నా జడుసుకునే సమయంలో టీఆర్‌ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా డాక్టర్ బాపురెడ్డి ఉద్యమాన్ని ముందుండి నడిపించారని మలిదశ ఉద్యమకారులు గుర్తుచేసుకున్నారు. డాక్టర్ బాపురెడ్డి మృతి చెందారనే విషయం తెలిసి సోమవారం రాత్రి ఇందిరాగాంధీ చౌరస్తాలో ఆయన చిత్రపటం ముందు కొవ్వొత్తులు వెలిగించి పార్టీలకతీతంగా మలిదశ ఉద్యమకారులు ఘన నివాళి అర్పించారు. రాజకీయ పదవులు పొందడంతో విఫలమైనా, ప్రజల గుండెల్లో బాపురెడ్డి చిరకాలం గుర్తుండి పోతారన్నారు. మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.



కొవ్వొత్తులతో మలిదశ ఉద్యమకారుల నివాళి

బీడీ కార్మికులకు జీవన భృతి చెల్లించాలి

దోమకొండ: బీడీ కార్మికులకు షరతులు లేకుండా రూ.4016 జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం దోమకొండ మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేశారు. తహసీల్దార్ సంజయ్‌రావ్‌కు వినతిపత్రం అందజేశారు. బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్(బిల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్ది రాములు ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి మాట్లాడారు. బీడీ కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సంఘం ప్రతినిధులు ఆంజనేయులు, నాయకులు వెంకట్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు



ఆందోళన చేస్తున్న బీడీ కార్మికులు

'అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం'



కామారెడ్డి అర్బన్: పీఆర్‌టీయూలో అన్ని సామాజిక వర్గాలకు సమాన ప్రాతినిధ్యం లభిస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పోచయ్య ఉద్యోగ విరమణ సభకు దామోదర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి సభ్యుడు తన వంతుగా కృషి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఎ.కుషాల్, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

రాకపోకలకు అడ్డు తొలగింపు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): అమర్లబండ గ్రామం నుంచి తాడ్వాయి మండలం కన్కల్ గ్రామానికి వెళ్లేందుకు ఇటీవల నిర్మించిన బీటీ రోడ్డును ఓ పట్టాదారు రైతు తన భూమికి నష్ట పరిహారం ఇవ్వలేదని దున్నేశాడు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మదన్ మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అధికారులతో మాట్లాడి రోడ్డుపై వేసిన అడ్డుకట్టను తొలగించి రోడ్డును వినియోగంలోకి తేవాలని తెలపడంతో డోజర్ సహాయంతో తొలగించి రోడ్డును అందుబాటులోకి తెచ్చారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు మహేశ్ రావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ పార్టీని మహిళా కార్యకర్తలు మరింత బలోపేతం చేయాలని ఏఎంసీ చైర్మన్ మారెడ్డి రజిత అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి అరుణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబా, కాంగ్రెస్ నాయకులు రూప, వెంకట్రాంరెడ్డి, తదితరులున్నారు.



రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టొద్దు

రాజంపేట: రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దని ఎస్సై పుష్పరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. వరి ధాన్యం, జొన్న, మొక్కజొన్న పంటలను ఆరబోయడానికి సమీపంలోని రోడ్లను కల్లాలుగా వాడుకుంటున్నారు.. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉదయం ఆరబోసిన ధాన్యాన్ని సాయంత్రం కుప్పలు చేసి రాత్రిళ్లు అక్కడే ఉంచడం వల్ల ప్రమాదాలకు దారితీస్తున్నాయని, రాత్రి సమయంలో కుప్పలు గమనించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టేందుకు ఎలాంటి అనుమతులు లేవని, కానీ తాము మానవతా దృక్పథంతోనే చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. ధాన్యాన్ని రోడ్డుపై పోసి ప్రమాదాలకు కారణమైతే ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బస్సులో అస్వస్థతకు గురైన యువతి

భిక్కనూరు: ఆర్టీసీ బస్సులో ఓ యువతి ప్రయాణిస్తూ తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన సోమవారం కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. కామారెడ్డి పట్టణానికి చెందిన యువతి ఒకరు హైదరాబాద్‌లో సివిల్ ఇంజినీర్‌గా ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. మూడు రోజులుగా పని ఒత్తిడి ఉండటంతో ఆమె నలతకు గురైంది. సెలవు పెట్టి కామారెడ్డికి వస్తూ హైదరాబాద్ నుంచి రామాయంపేట వరకు బస్సులో వచ్చింది. అక్కడి నుంచి కామారెడ్డి వెళ్లేందుకు కామారెడ్డి డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సులో ఎక్కింది. బస్సులో ప్రయాణికులు అధికంగా ఉండటంతో ఉక్కిరిబిక్కిరైంది. యువతి శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడటం గమనించిన తోటి ప్రయాణికులు, మహిళా కండక్టర్‌కు తెలపడంతో ఆమె తన సీటులో కూర్చోబెట్టారు. అయినా శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో బస్సును భిక్కనూరు చౌరస్తా వద్ద ఆపేశారు. మహిళా కండక్టర్ యువతిని కిందికి దింపి అక్కడే ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలిసి హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి కూడా అక్కడి చేరుకున్నారు. యువతిని పరీక్షించి వైద్యం అందించాలని హెడ్ కానిస్టేబుల్, శ్రీనివాస్‌రెడ్డి, మహిళా కండక్టర్ కోరడంతో ప్రైవేట్ వైద్యుడు పరీక్షించారు. బీపీ బాగా తక్కువగా ఉందని చెప్పగానే.. హెడ్‌కానిస్టేబుల్ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, బట్టర్ మిల్కును తీసుకొచ్చి యువతితో తాగించారు. కాసేపయ్యేసరికి యువతి కోలుకోవడంతో వెంటనే అదే బస్సులో కామారెడ్డికి పంపించారు.



చికిత్స చేయించి తిరిగి బస్సులో ఎక్కించేందుకు తీసుకెళ్తున్న మహిళా కండక్టర్

ఉపాధ్యాయుడిని బదిలీ చేయొద్దు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బొమ్మన్‌దేవ్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో జి.వెంకట్ గౌడ్ అనే ఉపాధ్యాయుడిని బదిలీ చేయొద్దని ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందించారు. సోమవారం ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్తున్నారన్న విషయం తెలుసుకుని పాఠశాలకు వారందరూ వచ్చారు. ఆయన వచ్చి ఏడాది మాత్రమే అయ్యిందని బదిలీ చేయడం సరి కాదన్నారు. అంతే కాకుండా ఆయన స్థానంలో వివాదాస్పద ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఉపాధ్యాయుడు రావడం ఒప్పుకోమని గ్రామస్తులు అన్నారు. మాజీ సర్పంచ్ అన్నం సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ నారాయణ రెడ్డి, గ్రామస్తులు భాస్కర్, రవి, మహేష్, అశోక్ తదితరులు ఉన్నారు.



వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

యోగా శిక్షకులను నియమించాలని వినతి

కామారెడ్డి అర్బన్: జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్(ఎన్‌ఆర్‌హెచ్‌ఎం) ఆయుష్ ఆస్పత్రుల వెల్‌నెస్ సెంటర్లల్లో యోగా శిక్షకులను నియమించడానికి ఇంటర్వ్యూలు నిర్వహించి నెలరోజులు గడుస్తున్నా నియామకాలు చేపట్టడం లేదని యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాం రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఆయుష్ రాష్ట్ర అదనపు డైరెక్టర్ స్వరూపారాణిని కలిసి వినతి పత్రం అందజేశారు. యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, భారత స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, కోశాధికారి రాజారెడ్డి, సంయుక్త కార్యదర్శి తోట సతీష్ తదితరులున్నారు.



వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలని ఐఎస్‌ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సోలంకి రవళి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మహిళలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం ఒకప్పుడు మహానగరాలకు పరిమితమై ఉండేదని, ప్రస్తుతం పట్టణాలు, మండలాలకు, గ్రామాలకు సైతం వచ్చిందన్నారు. ఏపీడీ మురళీ కృష్ణ, డీపీఎంలు సుధాకర్, రవీందర్ రావు, ఏపీఎం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవళి

ఘనంగా జాతీయ సమగ్రత దినోత్సవం

భిక్కనూరు: మండల కేంద్రంలోని అహ్మద్ బీఈడీ కళాశాలలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అబ్జర్వెన్స్ ఆఫ్ విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2024 కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ హనీఫ్ పాష ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమం నవంబర్ 3 వరకు కొనసాగిస్తామన్నారు. సోమవారం జాతీయ సమగ్రతను సమైక్యతను కాపాడుతామని పౌరుల హక్కుల పరిరక్షణకు పాటుపడుతామని విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

టపాకాయల దుకాణం సీజ్



కామారెడ్డి రూరల్:చిన్నమల్లారెడ్డి శివారులోని గురురాఘవేంద్ర కాలనీలో ఉన్న టపాకాయల గోదాము పోలీసులు, అగ్నిమాపక శాఖాధికారులతో కలిసి సోమవారం సీజ్ చేశారు. దేవునిపల్లి ఎస్సై రాజు, అగ్నిమాపక శాఖాధికారి సయ్యద్ మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో గోదాముపై దాడులు నిర్వహించారు. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా టపాకాయలు ఉండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్ శివారులోని పాములవాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అయిలాపూర్‌కు చెందిన ఆనంద్ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.నిందితుడిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

చెత్త తోపుడు బండ్లు ప్రారంభం



కామారెడ్డి టౌన్: మున్సిపల్ నిధులతో కొనుగోలు చేసిన చెత్త తోపుడు బండ్లను సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పట్టణంలోని కాలనీలో మురికి కాలువలను శుభ్రం చేసిన తర్వాత చెత్తను తీసుకెళ్లడానికి 76 బండ్లను కొనుగోలు చేసి ప్రారంభించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

బాన్సువాడకు రూ.15 కోట్ల సీఆర్‌ఆర్ నిధులు మంజూరు

బాన్సువాడ: బాన్సువాడ నియోజకవర్గానికి సీఆర్ఆర్ కింద రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో బీటీ, మెటల్ రోడ్లు, బ్రిడ్జిలను నిర్మించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 23 పనులకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు.

సంక్షిప్తం

సోమార్‌పేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డి: సోమార్‌పేట్‌లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ నర్సింలు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి విశ్వనాథం, డైరెక్టర్లు నారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, ఉన్నారు.

రెండో విడత పుస్తకాల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల విద్యావనరుల కేంద్రం నుంచి సోమవారం రెండో విడత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి షౌకత్‌అలీ తెలిపారు. రెండో తరగతి నుంచి 10వ తరగతి వరకు పార్టు-2 పుస్తకాలు పాఠశాలలకు సరఫరా చేసినట్లు తెలిపారు. మంగళవారం నుంచి విద్యార్థులకు పార్టు-2 పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. 12082 పుస్తకాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఏఈవో, వ్యాపారి రక్తదానం

కామారెడ్డి అర్బన్: రక్తహీనతతో బాధపడుతున్న ఓ రెండేళ్ల చిన్నారితో పాటు, కుప్రియాల్‌కు చెందిన 70 యేళ్ల వృద్ధురాలుకు ఇద్దరు సోమవారం రక్తదానం చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) అశోక్‌రెడ్డి బి-పాజిటివ్ రక్తం, వ్యాపారి రాకేష్ ఓ-పాజిటివ్ రక్తం దానం చేసినట్టు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు.

భవానిపేటలో పశువైద్య శిబిరం

లింగంపేట(ఎల్లారెడ్డి):భవానిపేటలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారి హనా జోనస్ తెలిపారు. ఈ సందర్భంగా 300 గేదెలు, 50 ఆవులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు తెలిపారు. పలు జాగ్రత్తలు సూచించారు. పశువైద్య సహాయకులు రవి, గోపాల మిత్రలు ఎజాస్, మల్లేశ్ పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉపాధి హామీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

మార్కండేయ ఆలయ అభివృద్ధికి విరాళం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని మార్కండేయ ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన కుర్రి అనసూయ రవికుమార్‌లు రూ.25వేల విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధి చాట్ల రాజేశ్వర్‌కు నగదును అందజేశారు.

వాలీబాల్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన శ్రీకాంత్ యాదవ్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రహ్మాజీవాడి గ్రామానికి చెందిన శ్రీకాంత్ యాదవ్ అనే విద్యార్థి వాలీబాల్‌లో ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ బాలయ్య, సీనియర్ క్రీడాకారుడు స్వామి తెలిపారు. శ్రీకాంత్ యాదవ్ ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని తన ప్రతిభను కనబర్చాడన్నారు. పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి నిజామాబాద్ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు.